క్లుప్తంగా

ఐటీడీఏ ఈఈగా మధుకర్

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలోని ఇంజనీరింగ్ విభాగములో ఈఈగా మధుకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ గా పనిచేసిన సత్యానందం బదిలీపై హైదరాబాద్ వెళ్లడంతో ఆయన స్థానంలో పాల్వంచ డివిజన్ డీఈగా పనిచేస్తున్న మధుకర్ పదోన్నతిపై భద్రాచలం ఐటీడీఏ ఇంజనీరింగ్ విభాగానికి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన మధుకర్‌కు కార్యాలయంలోని సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం ఎన్నిక

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో సోమవారం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడు గుడివాడ భూషణరావు అధ్యక్షతన జరిగిన ఈ ఎన్నికలో.. గౌరవ అధ్యక్షుడిగా అజరయ్య, కార్యదర్శిగా కె.మధుసూదనరావు, కోశాధికారిగా హనుమంతరావు, సహాయ కార్యదర్శిగా వెంకన్న, ఉపాధ్యక్షుడిగా రామచంద్రరావు, అనసూయ, సంయుక్త కార్యదర్శిగా సత్యనారాయణతో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

పోరాటాలతోనే బకాయిలు విడుదల

ములకలపల్లి: సీఐటీయూ పోరటాల ఫలితంగానే గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను ప్రభుత్వం విడుదల చేసిందని జీపీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు చిక్కుల శ్రీను అన్నారు. ములకలపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన వర్కర్ల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. కార్మిక పక్షపాతిగా సీఐటీయూ చేపట్టిన దశలవారీ పోరాటాల వల్లే సమస్య పరిష్కారమైందని అన్నారు. సంఘ మండల కార్యదర్శి గంటా శ్రీనివాస రావు, కోశాధికారి వర్కా రుక్మాంగధర రావు, మేకల రమేశ్, కమ్మంపాటి నాగరాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం రామాలయంలో ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న శ్యామ్ కుటుంబానికి ఆసరాగా వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం రూ.10 వేలు అందజేశారు. శ్యామ్ సతీమణి నవ్య శ్రీ పాల్వంచ వెళ్లే క్రమంలో యాక్సిడెంట్ కాగా.. విషయం తెలుసుకున్న వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు ఆ కుటుంబానికి రామాలయ ఈఓ దామోదర్‌రావు చేతుల మీదుగా ఆర్థిక సాయం చెక్కును అందించారు. వసుధ ఫౌండేషన్ కన్వీనర్ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

దసరా సెలవు 3న ప్రకటించాలి


కేసీహెచ్‌పీలో అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మణుగూరుటౌన్: దసరా పండుగ మహాత్మా గాంధీ అక్టోబర్ 2న ఒకే రోజున వచ్చిన నేపథ్యంలో.. సింగరేణి ఉద్యోగులకు అక్టోబర్ 3న దసరా సెలవు ప్రకటించాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్ కోరారు. ఈ మేరకు సోమవారం ఏరియాలోని అన్ని విభాగాల అధిపతులకు వినతిపత్రం అందజేశారు. నాయకులు గోలి గంగాధర్‌రావు, ఆవుల నాగరాజు, జి.శ్రీనివాస్, అంథోని రవి, సాయి ప్రకాశ్ చారి, దాట్ల సందీప్, సుదీప్త, రవి, కొండ రవి తదితరులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలని పాదయాత్ర


పాదయాత్రలో పాల్గొన్న సీపీఎం శ్రేణులు

దుమ్ముగూడెం: భద్రాచలం నుంచి వాజేడు వరకు ఉన్న ప్రధాన రహదారి ఇసుక లారీల వల్ల పూర్తిగా ధ్వంసం అయిందని, జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండి కూడా రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించకపోవడం వారి బాధ్యత రాహిత్యానికి నిదర్శనమని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు విమర్శించారు. ఈ మేరకు సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ములకపాడు క్రాస్ రోడ్డు నుంచి భద్రాచలం వరకు ప్రజా పాదయాత్రను నిర్వహించారు. సీనియర్ నాయకుడు యలమంచి రవికుమార్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రజల ప్రాణాలు పోతున్నప్పటికీ ప్రజాప్రతినిధులకు చలనం లేకుండా పోయిందని విమర్శించారు. పాదయాత్రకు బీఆర్ఎస్, సీపీఐ నాయకులు మద్దతు ప్రకటించాయి. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు యలమంచి వంశీ, కొర్సా చిలకమ్మ, మర్మం చంద్రయ్య, భూక్య రమేష్, చర్ల, దుమ్ముగూడెం మండలాల నాయకులు పాల్గొన్నారు.

పోయిరా గౌరమ్మా.. మళ్లీరా బతుకమ్మ..

ఘనంగా సద్దుల బతుకమ్మ

ఒక్కేసి పువ్వేసి చందమామా.. రెండు జాములాయే చందమామ.. అంటూ గ్రామ గ్రామాన మహిళలు బతుకమ్మ ఆటలు ఆడారు. చివరరోజైన సద్దుల బతుకమ్మ సందర్భంగా.. తీరొక్క పూలతో పెద్దపెద్ద బతుకమ్మలను పేర్చి అందంగా అలంకరించారు. సాయంత్రం ఐదు గంటల నుంచే మహిళలు పాటలు పాడుతూ ఆటలు ఆడారు. భక్తి శ్రద్ధలతో గౌరమ్మకు పూజలు చేశారు. అనంతరం బతుకమ్మలను స్థానిక చెరువులు, ఇతర జలవనరులలో నిమజ్జనం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


అశ్వాపురం: మొండికుంటలో సద్దుల బతుకమ్మ ఆడుతున్న మహిళలు


కరకగూడెం: బతుకమ్మలతో మాజీ ఎంపీపీ కాళిక, మహిళలు


మణుగూరుటౌన్: పట్టణంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


కరకగూడెంలో బతుకమ్మతో బాలిక


కరకగూడెం: బతుకమ్మతో సోదరుడు.. సోదరి


దుమ్ముగూడెం: బతుకమ్మలతో మహిళలు


భద్రాచలంఅర్బన్: ఒకే రంగు చీరలతో బతుకమ్మల వద్ద మహిళలు


భద్రాచలంటౌన్: బతుకమ్మలను తీసుకెళ్తున్న మహిళలు


చర్ల: బతుకమ్మ ఆడుతున్న మహిళలు


గుండాల: మర్కోడులో..

పరిహారం అందేనా?

- వాగులో గల్లంతైన మహిళ.. కుటుంబానికి తీరని దుఃఖం
- రెండేళ్లుగా ఎదురుచూపులు



వాగు ఉధృతికి కొట్టుకుపోతున్న తల్లీకూతుర్లు (ఫైల్), (ఇన్‌సెట్) సీతమ్మ (ఫైల్)

ములకలపల్లి: మండలంలోని కుమ్మరిపాడుకు చెందిన కుంజా సీతమ్మ గ్రామ శివారు వాగు దాటుతూ, వరద ఉధృతికి కొట్టుకుపోయింది. ఈ ఘటన జరిగి రెండేళ్ల కాలం గడిచినా బాధిత కుటంబానికి ప్రభుత్వం నుండి సాయం అందలేదు. కుమ్మరిపాడుకు చెందిన తల్లీకూతుర్లు కుంజా సీతమ్మ, కుర్సం జ్యోతి 2023 జూలై 26న వరి చాపరాలపల్లిలో వరి నాట్లు వేసి వస్తున్నారు.కూలీలందరూ వాగు దాటుతుండగా ప్రవాహ వేగానికి కొట్టుకుపోయారు. కూతురు జ్యోతి సమీపంలోని చెట్టుకొమ్మను పట్టుకోని బయటపడగా, మూడు రోజులు అనంతరం తల్లి సీతమ్మ మృతదేహం వెలుగు చూసింది. ఈ కుటుంబానికి ప్రకృతి విపత్తులు, వరద ప్రమాదం కింద రూ.4 లక్షలు అందిస్తామని అప్పట్లో ప్రజాప్రతినిధులు, అధికారులు చెప్పగా రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబానికి కాస్త ఆసరా లభిస్తుందని ఆశపడ్డారు. దీంతో మృతురాలి కొడుకు బాబు స్థానిక బ్యాంక్‌లో అప్పట్లోనే ఖాతా తెరిచి సంభందిత శాఖ అధికారులకు అందజేశారు. అయినా నేటికీ పరిహారం అందక ఎదురు చూపులే మిగిలాయి.

నిరుపేద కూలీ కుటుంబం

బాధితురాలు సీతమ్మది నిరుపేద కూలీ కుటుంబం. ఆమెకు ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. భర్త వీరస్వామి ఏళ్ల క్రితమే చనిపోగా, ఇద్దరు కుమార్తెల పెళ్లిళ్లు జరిగాయి. కుమారుడితో కలిసి జీవిస్తోంది. సీతమ్మ పొట్టకూటి కోసం దినసరి పనులు చేసుకుంటూ కుటుంబానికి అండగా నిలిచే క్రమాన మృత్యువాత పడినా కుటుంబానికి ఆసరా దక్కలేదు. ఈ విషయమై ఆమె కుమారుడు కుంజా బాబు మాట్లాడుతూ అధికారులు అన్ని వివరాలు సమర్పించి పరిహారం కోసం తిరుగుతున్నామని వాపోయాడు. ఇకనైనా న్యాయం చేయాలని కోరారు. కాగా, ములకలపల్లి తహసీల్దార్ భూక్యా గనియా వివరణ కోరగా.. ప్రమాదం జరిగిన వెంటనే ఆర్థికసాయం కోసం ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించామని తెలిపారు. ఆ ఏడాదిలో నిధుల లేమితో సాయం అందలేదని పేర్కొన్నారు. మరోమారు కలెక్టరేట్‌లో నివేదించినందున నిధులు మంజూరు కాగానే ఖాతాలో జమ అవుతాయని తెలిపారు.

మున్సిపాలిటీ భవన నమూనా సిద్ధం


మున్సిపాలిటీ భవన నమూనా చిత్రాన్ని చూపుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేట: అశ్వారావుపేట మున్సిపాలిటీ నూతన భవన నమూనా చిత్రాన్ని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సోమవారం ప్రదర్శించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మైనారిటీలకు కుట్టుమిషన్‌లు పంపిణీ చేసిన అనంతరం.. క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అశ్వారావుపేటకు మినీ బస్ డిపో మంజూరు కావడంతోపాటు నియోజకవర్గంలోని చంద్రుగొండ, దమ్మపేట, మండలపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లను ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. చంద్రుగొండ బస్టాండ్‌లో టాయిలెట్ల నిర్మాణం కూడా జరుగుతుందన్నారు. పంట పొలాలకు గ్రావెల్ రోడ్ల నిర్మాణానికి రూ.2.84కోట్లు చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాలకు మంజూరయ్యాయని తెలిపారు. అశ్వారావుపేట మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.15 కోట్లు, నూతన భవన నిర్మాణానికి రూ.7 కోట్లు, మార్కెట్‌కు రూ.1 కోటి, పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణానికి కూ.50 లక్షలు, దొంతికుంట చెరువు ఆధునీకరణకు రూ.5 కోట్లు, సీసీ రహదారులు, డ్రెయిన్ల నిర్మాణాలకు 7 కోట్లు మంజూరయినట్లు తెలిపారు. నియోజకవర్గంలో రూ.7 కోట్లతో సోలార్ ఆర్వో ప్లాంట్లు నిర్మించనున్నట్లు తెలిపారు. 10 మోడల్ గ్రామపంచాయతీలను ఎంపిక చేశామని, మరో నాలుగు గ్రామాలను ఎంపిక చేసి సంపూర్ణ సోలార్ వినియోగ గ్రామంగా తీర్చిదిద్దుతామన్నారు. గతంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించినట్లు తెలిపారు. ఆయన వెంట సొసైటీ చైర్మన్ చిన్నంశెట్టి సత్యనారాయణ, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు తదితరులున్నారు.

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

అశ్వాపురం: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంగా ఉండి పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచించారు. మండల కేంద్రంలో ఎస్‌కేటీ కళ్యాణమండపంలో సోమవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య అధ్యక్షతన పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే పాయం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. పార్టీకి వ్యతిరేకంగా ఎవరు పనిచేసినా ఉపేక్షించేది లేదన్నారు. ఈ సమావేశంలో నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, ఊసా అనిల్, కాకా రాములు, బట్టా సత్యనారాయణ, కాకా అశోక్, బేతం రామకృష్ణ, బూరెడ్డి వెంకటరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తూము వీరరాఘవులు, గాదె వెంకటరెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కుల వ్యవస్థను నిర్మూలించాలి


దమ్మపేట: సదస్సులో మాట్లాడుతున్న మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి రాము

దమ్మపేట: తరతరాలుగా సమాజాన్ని పట్టి పీడిస్తున్న కుల వ్యవస్థ నిర్మూలనకు పోరాడుదామని, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి అమర్లపూడి రాము పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని జగ్గారం, గండుగులపల్లి గ్రామాల్లో మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో కుల నిర్మూలన సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ.. మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలను ఆదర్శంగా తీసుకుని, కుల వ్యవస్థను కూకటి వేళ్లతో సహా పెకిలించాలని పిలుపునిచ్చారు. కులం, మతాలతో రాజకీయం చేస్తున్న బీజేపీ తీరు సరికాదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు తోడెం దుర్గమ్మ, కుర్సం ముత్యాలరావు, వగ్గెల ప్రసాద్, కేసరి వెంకటేష్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: జ్యోతిరావు పూలే సత్యశోధక్ సమాజ్ స్ఫూర్తితో కుల నిర్మూలనకు కృషి చేద్దామని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోగినపల్లి ప్రభాకర్ అన్నారు. సోమవారం మండలంలోని కావడిగుండ్ల గ్రామంలో కుల నిర్మూలనపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మతం పేరుతో విభజించే బీజేపీ–ఆర్ఎస్ఎస్ భావజాలానికి ప్రతిపక్ష పోరాటం అవసరమని అన్నారు. ఈ సదస్సులో నాయకులు కంగాల కల్లయ్య, కంగాల భూలక్ష్మి, వాసం పోతురాజు, కంగాల వెంకటేష్, కంగాల కన్నయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ములకలపల్లి: జ్యోతిరావు పూలే స్ఫూర్తితో కుల నిర్మూలనకు కృషి చేద్దామని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కెచ్చెల రంగారెడ్డి పిలుపునిచ్చారు. మొగరాలగుప్ప గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడారు. దేశం ప్రగతిపథంలో సాగిపోతుందని పాలకపక్షాలు చెపుతున్నా, నేటి సమాజంలో కుల భావనలు కొనసాగుతున్నాయని అన్నారు. జిల్లా కార్యదర్శి ముద్దా బిక్షం, పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోకినపల్లి ప్రభాకర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నూపా భాస్కర్, అమర్లపూడి రాము, జిల్లా నాయకులు పోతుగంటి లక్ష్మణ్, సంయుక్త మండల కార్యదర్శి కొర్సా రామకృష్ణ, కొర్సా గణపతి, నకిరకంటి నాగేశ్వరరావు, కల్లూరి పద్మ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు


పిల్లలను పరీక్షిస్తున్న డాక్టర్ క్రాప విజయ్‌కుమార్

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ క్రాప విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పిల్లలకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. వ్యాధి తీవ్రత ఎక్కువ ఉన్న వారిని మెరుగైన వైద్యం కోసం ఏరియా హాస్పిటల్ భద్రాచలంకి రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రుక్మాకర్ రెడ్డి, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతీ పూజలు

అశ్వారావుపేటరూరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సోమవారం అమ్మవారు భక్తులకు సర్వస్వతీదేవీ అలంకరణలో దర్శనం ఇచ్చారు. మండలంలోని శ్రీరంగాపురం, అచ్యుతాపురం, ఊట్లపల్లి, వినాయకపురం, మామిళ్లవారి గూడెం, ఆసుపాక, అశ్వారావుపేటతోపాటు పలు గ్రామాల్లోని ఆలయాలు, మండపాల్లో భక్తులు అమ్మవారికి పలు రకాల పూజలు చేశారు. అలాగే అమ్మవారు సరస్వతీ దేవిగా దర్శనం ఇవ్వడంతో చిన్నారులు ప్రత్యేక పూజలు చేశారు.

దమ్మపేట: దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకొని మండల పరిధిలోని పలు మండపాలు, శివాలయాల్లో అమ్మవారిని సోమవారం సరస్వతి రూపంలో ఘనంగా అలంకరణ చేసి, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మండలంలోని ముష్టిబండ శివారులో గుట్టపై వేంచేసియున్న దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన సరస్వతి పూజా కార్యక్రమంలో వందల సంఖ్యలో బాలబాలికలు పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో ఆలయాలకు విచ్చేసి, అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను అందజేశారు.

పర్ణశాలలో ఐశ్వర్యలక్ష్మి అలంకరణ

దుమ్ముగూడెం: పర్ణశాల పుణ్యక్షేత్రం శ్రీ సీతారామ చంద్రస్వామి వారి ఆలయంలో దసరా శ్రీ లక్ష్మీ అమ్మవారు ఐశ్వర్యలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం లక్ష్మీ అమ్మవారికి పూజలు నిర్వహించగా.. భక్తులు, గ్రామస్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం గ్రామంలోని చిన్నారు, విద్యార్థులను ఆలయంలోకి తీసుకొనివచ్చి ఆశీర్వదిస్తూ పుస్తకం, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జ్ అనిల్ కుమార్, ఆలయ అర్చకులు శ్రీ కోటి విష్ణువర్ధనాచార్యులు, భార్గవాచార్యులు, నరసింహాచార్యులు, వెంకటాచార్యులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


దమ్మపేట: ముష్టిబండ దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంలో సరస్వతి పూజలో పాల్గొన్న బాలబాలికలు

నిబంధనలా.. అయితే మాకేం!

- యథేచ్ఛగా ట్రాఫిక్ ఉల్లంఘనలు
- జరిమానాలు విధిస్తున్నా మారని తీరు


నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

భద్రాచలంఅర్బన్: సీటు బెల్టు పెట్టుకోవాలని, హెల్మెట్ ధరించాలని పోలీస్, రవాణా శాఖ అధికారులు పదేపదే చెబుతున్నా వాహనదారుల్లో మార్పు కనిపించడం లేదు. సదస్సులు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నా కొద్ది మంది మాత్రమే స్పందిస్తున్నారు. ఈ ఏడాది మే నెల నుంచి ఆగస్టు దాకా భద్రాచలం ట్రాఫిక్ పోలీసులు వివిధ రూపాల్లో 9260 మందిపై ట్రాఫిక్ ఉల్లంఘనల కేసులు నమోదు చేయగా.. వారికి రూ. 25లక్షల 76 వేల 730 లు జరిమానాను విధించారు.

ట్రిపుల్ రైడింగ్‌తో ట్రబుల్

ఎక్కువగా కళాశాల స్థాయి యువకులు ట్రిబుల్ రైడింగ్ చేస్తున్నారు. ఈ ఏడాది మే నెల నుంచి ఆగస్టు దాకా ట్రిపుల్ రైడింగ్,రాంగ్ రూట్, హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయడం, ట్రాఫిక్ సిగ్నల్స్ జంప్ చేయడంతో పాటు నో పార్కింగ్ లో వాహనాలు పార్క చేసిన 8,258 మందినిపై కేసులు నమోదు చేశారు. వారికి రూ.18,81,730 లక్షల జరిమానాను పోలీసులు విధించారు. వీరిలో అనేక మంది హెల్మెట్ పెట్టుకుంటే జుట్టు ఊడిపోతుందని, కొందరు తలపై అదనపు భారం అనే అపోహతో ధరించడం లేదని తేలింది.

పెరుగుతున్న మైనర్ డ్రైవింగ్...

పిల్లలకు ఎలాంటి లోటు లేకుండా చూడాలన్న ప్రేమతో తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలు ఇస్తున్నారు. రోడ్డు భద్రత గురించి, ట్రాఫిక్ నిబంధనలు తెలియని మైనర్లు అతి వేగంగా నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. వాహనం నడిపే సామర్థ్యం ఉందని, వాహనాన్ని నియంత్రించగలమనే అతి నమ్మకం వారిని ప్రమాదాలకు గురయ్యేలా చేస్తోంది. ఈ తరహాలో మే నుంచి ఆగస్టు దాకా భద్రాచలం లో 28 కేసులు నమోదయ్యాయి. ఇందుకు సంబంధించి రూ.14 వేలు వరకు ట్రాఫిక్ పోలీసులు జరిమానాలు విధించారు. పట్టుబడిన మైనర్లతో పాటు వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకునేలా చట్టం, నిబంధనలు ఉన్నాయి.

సెల్‌ఫోన్ మాట్లాడుతూ..


కొందరు వాహన డ్రైవింగ్‌లోనే సెల్‌ఫోన్ మాట్లాడుతూ ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇలా మొబైల్ వాడుతూ నాలుగు నెలల్లో 46 మంది పై పోలీసులు కేసు నమోదు చేయగా, వారికి రూ.46 వేల వరకు జరిమానా విధించారు.

డ్రంకెన్ డ్రైవ్...

లారీ, ఆటోడ్రైవర్లు కొందరు మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్నారు. మద్యం మనతోపాటు ఎదుటివారి ప్రాణాలను ప్రమాద రూపంలో బలిగొంటుదన్న విషయాన్ని వాహన చోదకులు గమనించాలి. ఇలా గడిచిన నాలుగు నెలలో దాదాపు 582 కేసులు నమోదు అయినట్లు పోలీసులు తెలిపారు.

ఆయా నిబంధనలు, పాటించకపోవడంతో ఎదురయ్యే పర్యావసనాలపై ట్రాఫిక్ పోలీసులు తరచుగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. వాహనదారులు వాటని తూచా తప్పకుండా పాటించాల్సి ఉంది.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు..



ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవు. నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిరంతరం జరుగుతున్నాయి. నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపకూడదు. పదే పదే ఉల్లంఘనలకు పాల్పడే వారు తనిఖీల్లో పట్టుబడితే జరిమానాలు విధించడమే కాక కఠిన చర్యలు ఉంటాయి.

– తిరుపతిరావు, ట్రాఫిక్ ఎస్ఐ, భద్రాచలం